==
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 25:6 June 2025
==

కనగల్ మండల మౌఖిక వ్యవహారం: విలక్షణత

(*The Distinctiveness of Oral Language use in Kanagal Mandal*)

Prof. Dr. Pammi Pavan Kumar
Professor of Telugu
pavankpammi@uohyd.ac.in

Mr. Bommagani Naveen Kumar
Ph. D. Research Student, Department of Telugu, University of Hyderabad,
HYDERABAD – 500046, Telangana State, India
23htph11@uohyd.ac.in

0. పరిచయం:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాను నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాలుగా విభజించింది. అలా 11 అక్టోబర్ 2016 న నూతన నల్లగొండ జిల్లా ఏర్పడింది. నూతనంగా ఏర్పడిన నల్లగొండ జిల్లాలో ఉన్న 32 మండలాలలో కనగల్ మండలం ఒకటి. నల్లగొండ జిల్లా కేంద్రం నుండి 16 కి.మీ దూరంలో కనగల్ మండలం ఉన్నది. కనగల్ మండలం ఎమ్మార్వో ఆఫీసువారు అందించిన సమాచారం మేరకు, మండలంలో 04-11-2024 సంవత్సరం నాటికి మొత్తం 31 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. కనగల్ మండలంలోని గ్రామపంచాయితీలతో సహా వాటిలో ఉన్న చిన్న చిన్న గూడాలు కలుపుకొని మొత్తం 72 గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా గణాంకాల ప్రకారం కనగల్ మండల జనాభా- 41,555, అక్షరాస్యత 59%. కనగల్ మండలానికి సరిహద్దులుగా నల్లగొండ రెవెన్యూ డివిజన్‌లో నల్లగొండ, చండూరు; దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లోని గుర్రంపోడు; మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ లోని అనుముల, నిడమనూరు మండలాలు ఉన్నాయి.

కనగల్ మండల ప్రజల మౌఖిక వ్యవహారాన్ని ఆధారం చేసుకొని నామ ప్రాతిపదికలు, లింగం, వచనం, మాన్యత, విభక్తుల ప్రవర్తనను అధ్యయనం చేస్తూ వర్ణనాత్మక వ్యాకరణం పద్ధతిలో ఆ విశేషాలను వివరించడం ఈ పత్రం ముఖ్య ఉద్దేశం. నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని ప్రజలు మాట్లాడే భాషానిర్మాణాన్ని, పదప్రయోగ

విలక్షణతను అర్థంచేసుకోవడానికి ఈ పరిశోధన తోడ్పడుతుంది. క్షేత్రపర్యటన ద్వారా ప్రాథమికంగా ఏడుగురు వ్యవహర్తల నుండి సేకరించిన సమాచారం(టైపులో 96 పేజీల వ్యవహార ఖండికలు) ఈ అధ్యయనానికి ప్రధాన ఆకరం. ఈ ఏడుగురు వ్యవహర్తలను కనగల్ మండలంలోని పర్వతగిరి గ్రామం నుండి ఎంపిక చేయడమైంది.

1. కీలక పదాలు:

కనగల్ మండలం, మౌఖికవ్యవహారం, వ్యవహర్తలు, క్షేత్రపర్యటన, నామరూప విజ్ఞానం, నామ ప్రాతిపదికలు, లింగం, వచనం, మాన్యత, విభక్తులు, భాషానిర్మాణం, వర్ణనాత్మక వ్యాకరణం.

2. వ్యవహర్తల వివరాలు:

క్ర.సం.	వ్యవహర్త పేరు	లింగం	వయసు	విద్య	వృత్తి
1.	కంది లింగయ్య	పురుషుడు	48	డిగ్రీ	MGNREGA ఫీల్డ్ అసిస్టెంట్
2.	ఎస్‌కె అమీన	స్త్రీ	55	చదువుకోలేదు	దినసరి కూలీ
3.	చెనగాని యాదమ్మ	స్త్రీ	55	చదువుకోలేదు	వ్యాపారి
4.	తోలుగళ్ళ రాములు	పురుషుడు	55	నాలుగవ తరగతి	రైతు
5.	వరికుప్పల లచ్చయ్య	పురుషుడు	68	ఐదవ తరగతి	కార్మికుడు
6.	మావిడి ఈశ్వరయ్య	పురుషుడు	78	చదువుకోలేదు	కూరగాయల వ్యాపారి
7.	కర్నాటి చంద్రయ్య	పురుషుడు	85	పెద్దబాలశిక్ష చదువుకున్నారు	రైతు& గీతకార్మికుడు

3. నామరూప విజ్ఞానం (Noun Morphology):

3.0 నామ ప్రాతిపదికలు (Nominal Stems):

3.1 దేశ్య నామ ప్రాతిపదికలు:

తెలుగులోని దేశ్య ప్రాతిపదికలను ప్రాథమిక(నిష్పన్న) నామాలు, ద్వైస్థాయి నిష్పన్న నామాలు, తృతీయ స్థాయి నిష్పన్న నామాలు, తృతీయానంతర స్థాయి నిష్పన్న నామాలుగా విభజించవచ్చు. ఈ విభాగంలో ప్రాథమిక(నిష్పన్న) నామాలు, ద్వైస్థాయి నిష్పన్న నామాలను గురించి పరిశీలిద్దాం.

3.1.1 ప్రాథమిక (నిష్పన్న) నామాలు (Primary [Derived] Nouns):

అ) నామ ప్రాతిపదిక(Nominal Base)కు లింగ వచన ప్రత్యయాలు చేరని నామ ప్రాతిపదికలు ఈ విభాగంలోకి వస్తాయి.

మహద్వాచకాలు(Masculine):

తాత — "ఇగ నన్నేఁవనేది ఆ ముసలోళ్లు, యాడిగ్‌బొాయిర్యా తాత? యాడిక్‌బొాయినవ్ చెప్పు నాతర? అనేది." (కర్నాటి చంద్రయ్య)

నాయన — "మీర్ మాప్టీల్ బువ్వలు బెద్తరు కమ్మిష్టోల్లకని. ఆ మా నాయనల పట్కపోయేది." (కర్నాటి చంద్రయ్య)

కొడుకు — "ఆయన బిల్పిస్తె బొాయిన. ఆయన కొడుకు అయ్యప్ప మాలేశిండు." (మావిడి ఈశ్వరయ్య)

మహతీ వాచకాలు(Feminine):

అమ్మ — "సదువుపియ్‌లే మా అమ్మ మా నాయన." (చెనగాని యాదమ్మ)

అక్క — "యిాడ మారపల్లి గౌరారానున్న ఎల్మాయన, మా అక్కనిచ్చినం ఆడ్కి." (మావిడి ఈశ్వరయ్య)

బిడ్డ — "పిల్లలు నాకు ముగ్గురు కొడ్కులు, ఒక బిడ్డె. ఆ బిడ్డ సచ్చిపోయింది." (తోలుగళ్ళ రాములు)

మహతీతర అమహద్వాచకాలు(Neuter):

కుండ — "ఒక్క తాడు ఈడ్ పడ్‌సీసల్, పదియేన్ సీసలయ్యేదియా. తక్కువయ్యేదన్కున్నవా. రొండోదొాడుస్తే కుండ." (కర్నాటి చంద్రయ్య)

వొాద్దోలు, ముస్తాదు, మోకు — "యిాపుకు వొాద్దోలు, నడుంకు ముస్తాదు, మోకు గోతి ఇయన్నుండె." (కర్నాటి చంద్రయ్య)

ఆ) నామ ప్రాతిపదికకు లింగ, వచన, ప్రత్యయాలు(Gender Number Marker) చేరి కింది విధమైన రూపాలు ఏర్పడతాయి.

మహద్వాచకాలు:

మనవడు — "సదువుకుర్రు. మా మనవడు, మనవరాల్లంత జదువుతుర్రు." (వరికుప్పల లచ్చయ్య)

తమ్ముడు — "ఇట్లా బర్తా తమ్ముడు గూడుంటడుగా! ఆయన దేవర అంటం." (ఎస్‌కె అమీన)

మహతీ వాచకాలు:

చెల్లెలు — "కాలమ్మ అంటెనేఁవొా, అమ్మ చెల్లెలు." (ఎస్‌కె అమీన)

శెల్లెలు — "ఇగా మా అమ్మ శెల్లెలుంటదిగా కాలమ్మ అంటం. కాలా అంటం. అంటే అమ్మశెల్లెలు కాలా అంటె ఆఁవ శిన్నమ్మే కాని, కాలా అంటం."(ఎస్‌కె అమీన)

మనవరాలు "ఇపుడు గాసుమీద ఒంతానికే శాతనైతలేదు. మీకు <u>మనవరాలు</u> నిన్నే వొండవంటదో యేఁవొ." (ఎన్కె అమీన)

మహతీతర అమహద్వాచకాలు:

వ్యవసాయం>యెవసాయం "తాల్లెక్కుడు, <u>యెవసాయం</u> జేస్కునుడు, బర్లు , మేకలు, వో పాలు ఊకునేదానియా ఇయ్యాలపుడు యాడూకునేది." (కర్నాటి చంద్రయ్య)

తట్ట "అక్కడ మాక్ ఎర్కలోల్లు అల్లేది పెండ <u>తట్టలు,</u> గింత గింతుండేది." (కంది లింగయ్య)

3.1.1.1 క్రియా ధాతువుల మీద చేరే ప్రాథమిక నిష్పాదక ప్రత్యయాలు

క్రియా ధాతువులమీద చేరి, నిష్పన్న నామాలు ఏర్పడటానికి కారణమయ్యే ప్రాథమిక నిష్పాదక ప్రత్యయాలు కింద సూచించబడ్డాయి. వ్యాకర్తలు వీటిని "కృదంతాలు" (చూ. బాలవ్యా, కృదంత.) అన్నారు.

-అకం నమ్ము+అకం= నమ్మకం >నమ్కం

"అంటే శానా దూరం <u>నమ్కం</u> తక్కువ. కొద్దిగ సూప్ తక్కువైతుంది." (కర్నాటి చంద్రయ్య)

-పు చూచు+పు=సూప్>చూపు

"అంటే శానా దూరం నమ్కం తక్కువ. కొద్దిగ <u>సూప్</u> తక్కువైతుంది."(కర్నాటి చంద్రయ్య)

-ట మండు+ట=మంట

"కట్టెల్ దీస్కొచ్చి పొయి <u>మంట</u> బెట్టేది."(ఎన్కె అమీన)

-క మొలచు+క=మొలక>మొల్క

"ఆడికె పెద్ద గొప్ప <u>మొల్క</u> జల్లే వరిశేను పందువొడ్లు బండేది." (వరికుప్పల లచ్చయ్య)

3.1.2 ద్వైస్థాయి నిష్పన్న నామాలు (Secondary Derivative Nouns):

ప్రాథమిక నామాలపై నిర్మాణ ప్రత్యయం (Formative suffix) వికల్పంగా**,** ద్వైస్థాయి నిష్పాదక ప్రత్యయం (Secondary Derivative Suffix) నిత్యంగా చేరడంవల్ల ద్వైస్థాయి నిష్పన్న నామాలు (Secondary Derivative Nouns) ఏర్పడతాయి.

అ) నామ ప్రాతిపదిక + ద్వైస్థాయి నిష్పాదక ప్రత్యయం

మహద్వాచకాలు:

-వంతుడు బగ**+**వంతుడు**=**బగవంతుడు

"ఆయనెట్ల బాడ్తడో ఎట్ల వాయించాల్నో. <u>బగవంతుడా</u> వూకనన్నొస్తిఁవి." (మావిడి ఈశ్వరయ్య)

మహతీతర అమహద్వాచకాలు:

-పోతు దున్న-పోతు=దున్నపోతు

"సదువు లేదు. దున్నపోతుల నాగలె. అదే సదువు." (మావిడి ఈశ్వరయ్య)

-రికం సుట్ట+రికం= సుట్టరికం

"ఇయ్యపు సుట్టరికం వుంటది. కంచపు సుట్టం వుంటది." (మావిడి ఈశ్వరయ్య)

ఆ) నామ ప్రాతిపదిక+నిర్మాణ ప్రత్యయం+ద్వైస్థాయి నిష్పాదక ప్రత్యయం

వీటిని సంప్రదాయ వ్యాకరణాలు 'తద్ధితాలు' అన్నాయి.(చూ.బాలవ్యా.తద్ధిత.)

మహద్వాచకాలు:

పిల్ల-కా-డు= పిల్లగాడు

"పెల్లిజేయగనే నల్గురు పిల్లలు బుట్టిర్రు. మొట్టమొదట ఆఁవడాల పిల్ల, ఓ పిల్లగాడు." (మావిడి ఈశ్వరయ్య)

మహతీవాచకాలు:

మనుమ-ర్-ఆలు=మనుమరాలు

"మా మనవడు, మనవరాల్లంత జదువుతుర్రు." (వరికుప్పల లచ్చయ్య)

మహతీతర అమహద్వాచకాలు:

దొంగ-తన-ము=దొంగతనం<దొంగతనము

"నాది గవుర్మెంటు జాబు. నేనక్కడ జీతంకు దొంగతనంగొచ్చిన." (మావిడి ఈశ్వరయ్య)

ఇ) విశేషణ ప్రాతిపదిక+ద్వితీయ స్థాయి నిష్పాదక ప్రత్యయం

-ది

పెద్ద-ది=పెద్దది "అప్పుడేఁవొ ఆరుట్ల మంచాల అనేది. ఆరుట్ల బొయిందప్పుడు. మంచాల మండలం పెద్దది." (మావిడి ఈశ్వరయ్య)

ఈ) విశేషణ ప్రాతిపదిక+నిర్మాణ ప్రత్యయం+ద్వైస్థాయి నిష్పాదక ప్రత్యయం

మంచి-తన-ము=మంచితనం<మంచితనము

"జీతవుండి జీతవుండి ఆల్ నా మంచితనం జూశి, ఆల్ పిల్లనిచ్చి పెల్లిజేశిరు." (మావిడి ఈశ్వరయ్య)

3.2 లింగం (Gender):

తెలుగులో నామవాచకాల అర్థాన్ని బట్టి లింగబోధకత ఉంటుంది. మహద్వాచకం, అమహద్వాచకం అని రెండు విధాలుగా లింగాన్ని విభజించవచ్చు. మహద్వాచకంలో పురుషనామాలు, అమహద్వాచకంలో స్త్రీలింగ, నపుంసక లింగ నామాలు చేరుతాయి. ఇప్పటివరకు క్షేత్ర పర్యటన ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా కనగల్ మండల మౌఖిక భాషలో లింగబోధకత ఈ కింది విధంగా ఉన్నది.

3.2.1 లింగ బోధక ప్రత్యయాల్ని గ్రహించని నామాలు:

3.2.1.1 మహద్వాచకాలు:

నాయిన "ఉన్నది కొద్దిగ ఎకరం ఆరుగుంటలుంది. నా మా <u>నాయిన</u> సంపాయించింది." (మావిడి ఈశ్వరయ్య)

తాత "మీ <u>తాత</u> అంజనేయ్‌లేశఁవేస్తె, మొత్తఁవ్ అంజనేయ్‌ల్ నోట్లంగ బుట్నుండె వుండె." (మావిడి ఈశ్వరయ్య)

3.2.1.2 మహతీ వాచకాలు:

కోడలు "ఇపుడు మా <u>కోడలు</u> ఏం పన్జేయదు. ఇంటికాడుంటది."(ఎస్‌కె అమీన)

3.2.1.3 మహన్మహతీ వాచకాలు:

పుస్తె "మాక్ పుస్తైతె బర్త కట్టడు." (ఎస్‌కె అమీన)

బిడ్డ "నఁవాస అంటెనేఁవొ <u>బిడ్డ</u> కొడుకు. నువున్నావు నాకు నఁవాస."(ఎస్‌కె అమీన)

3.2.2 లింగ బోధక ప్రత్యయాల్ని గ్రహించే నామాలు

3.2.2.1 మహద్వాచకాలు:

-డు వొకడు

"అండ్ల <u>వొకడు</u> తిర్పటం దగుల్తడు." (మావిడి ఈశ్వరయ్య)

3.2.2.2 మహతీవాచకాలు:

-ఆలు మనవరాలు

"ఇపుడు గాసుమీద ఒంతానికే శాతనైతలేదు. మీకు <u>మనవరాలు</u> నిన్నే వొండవంటదో యేఁవొ." (ఎస్‌కె అమీన)

3.2.2.3 మహతీతర అమహద్వాచకాలు:

అన్నం "ఇగనేను పోంగనే ఇన్నొద్దుట్‌లెక్క <u>అన్నం</u> దింటట్ లేదు. నాక్ బీపి వుంది యాన్నన్న చాయ్‌లు అరటిపండు దింట." (మావిడి ఈశ్వరయ్య)

సాయంత్రం "పొయినం ఇంగింకాడ్కి <u>సాయంత్రం</u> నాల్గైంది." (మావిడి ఈశ్వరయ్య)

దీపం "వాస్తంగ ఆయన సచ్చిపొయిండు. మనం బత్కున్నం గాని. <u>దీపఁ</u>వయితే యేశాల పుల్లయ్యె మనూర్కి." (మావిడి ఈశ్వరయ్య)

3.3 వచనం (Number):

తెలుగులో వచనం అనేది ఏకవచనం, బహువచనం అని రెండు రకాలుగా ఉంటుంది. ఏక వస్తు/వ్యక్తి బోధ ఏకవచనంలోనూ, ఒకటికి మించిన వస్తువుల వ్యక్తుల బోధ బహువచనంలోనూ కలుగుతుంది. బహువచన ప్రత్యయాలు చేరడం వల్ల పదనిర్మాణంలో జరిగే మార్పులు ఇక్కడ చూడవచ్చు.

3.3.1 బహువచన ప్రత్యయం/పదాంశం:

ఇప్పటివరకు సేకరించిన సమాచారంలో -ము, -రు, -ండ్లు, -లు ప్రత్యయాలు బహువచనంలో కనిపిస్తున్నాయి

3.3.1.1 -ము

మేం	"ఇగ <u>మేం</u> నోర్మూస్కొని సప్పుదుగాకుట యేం అనక్పొయ్యేది." (కర్నాటి చంద్రయ్య)
మమ్ముల	"యెవ్వడు కొట్టకపొయ్యేది. <u>మమ్ములేఁవ్</u> అనకపొయేది ఆల్లు." (కర్నాటి చంద్రయ్య)
మేఁవ్	"<u>మేఁవ్</u> రజాకార్ల బొయినోల్లం గావు. నక్సలైట్ల బొయినోల్లం గావు. మాకేద్ దెల్వదు."(వరికుప్పల లచ్చయ్య)
మేఁవు	"ఇగ <u>మేఁవె</u>ద్గినం. ఇగ మోటర్లు బొయినయ్. పసులమ్ముడు బొయింది. కోసుడు బొయింది." (తోలుగళ్ళ రాములు)
మనఁవ్	"అల్లేం జేస్తరంటె పదిర్వై యేస్తరు చరాలు. నువ్ సైకిల్ చరాలేస్తరు అయి ఇగ <u>మనఁవ్</u> సక్కగ శూశి కొట్నఁవంటె ఆ ఏరియల్నే తల్గుతదిగ."(కంది లింగయ్య)

3.3.1.2 -రు

ముగ్గు-రు	"పిల్లలు నాకు <u>ముగ్గురు</u> కొడ్కులు ఒక బిడ్డె." (వరికుప్పల లచ్చయ్య)

3.3.1.3 -ండ్లు

జీతగాండ్లు	"ఇప్పుడ్ ఇప్పుడు సొతంత్రమాయె. ఇప్పుడు ఇప్పుడు యే ఎవల్కాన్నన్న <u>జీతగాండ్లున్నరా?</u>." (కర్నాటి చంద్రయ్య)
నాగండ్లు	"జీతాలుంటె <u>నాగండ్లు</u> దున్నేది. మోటర్లు గొట్టేది." (తోలుగళ్ళ రాములు)
ఇండ్లు	"అయిదు <u>ఇండ్లు</u>న్నయ్ గాని ఇర్వైమందుంటరు."(ఎస్కె అమీన)

3.3.1.4 -లు

మహత్, అమహత్, మహతీతర అమహద్వాచక భేదాలతో సంబంధం లేకుండా -లు అనే బహువచన ప్రత్యయం అన్ని నామాలపై చేరుతుంది.

3.3.1.4.1 ప్రాతిపదికాంత ఇత్వం ఉత్వంగా మారటం

కత్తి+లు=కత్తులు "ముస్తాదు, మోకు, <u>కత్తులు</u> ఇయన్నుండేది." (కర్నాటి చంద్రయ్య)

బుజకీర్తి+లు=బుజకీర్తులు "డిర్సులు, రంగులు, కిరీటాలు <u>బుజకీర్తులు</u> ఘద." (మావిడి ఈశ్వరయ్య)

రూపాయి...లాంటి చోట్ల '-లు' పరమైనప్పుడు ఇకారం ఉకారంగా మారక దానిస్థానంలో -లు వచ్చి చేరుతుంది. అదేవిధంగా, 'పశువు'...లాంటి చోట్ల కూడా తుది ఉత్వ విశిష్ట వకారం స్థానంలో '-లు' చేరుతుంది.

రూపాయి+లు= రూపాలు "ఆ నీల్దెచ్చి, మల్లా బువ్వొండుకోని, మల్ల కూరొండుకోని మల్ల కలవ బొయ్యేది. ఇర్వై <u>రూపాలు</u> పదియేన్రూపాలు అప్పుడు." (చెనగాని యాదమ్మ)

పశువు+లు=పసులు "<u>పసులు,</u> బర్లు, మేకలు తోల్కోన్ బొయ్ మేపుకోని, అక్కడ బొబ్బెరకాయలు గట్ట గాల్చుకోని తిని, తాటిపండ్లు గట్టి చీకి మల్లొచ్చి మల్లొడ్లు దంచేది."(ఎస్కె అమీన)

3.3.1.4.2 ఉపోత్తమ ఇత్వం ఉత్వంగా మారటం

మనిషి+లు=మనుసులు "ఎవ్వ! అంత యెడ్లసోంటి <u>మనుసులు</u> గదా." (కర్నాటి చంద్రయ్య)

3.3.1.4.3 ప్రాతిపదికాంత ఉత్వం లోపించటం

యిల్లు+లు=యిండ్లు<ఇళ్ళు "ఆల్లింటి పక్కపొంటే వున్నయ్ యెల్మోల <u>యిండ్లు</u>. బానె పద్ పదియేనున్నట్టుంది." (మావిడి ఈశ్వరయ్య)

3.3.1.4.4 ప్రాతిపదికాంత అనునాసికానికి లోపం, తత్పూర్వ స్వరానికి దీర్ఘం రావటం

పొలం+లు=పొలాలు "పొలాలపని <u>పొలాల</u>కే పసులకాడోడు పసులకాన్నే." (కర్నాటి చంద్రయ్య)

ఎకరం+లు=ఎకరాలు "ఆ కాలంవ్‌లో మీ తాతె తెలివికల్లోడు. ఆయన్ని సంపాయించుకుంటె ఇయ్యాల <u>వందెకరాలు</u> గట్టుకున్న యెవ్వడడిగేటోడు లేడయ. కానీన ఆ మ్యాటర్కు రాలె." (మావిడి ఈశ్వరయ్య)

3.3.2 నిత్య బహువచనాలు:

అందరు "ఇగ <u>అందరు</u> మా వొడ్రోల్లం మాత్రం ఇగ తొమ్మిది పదేండ్లకు ఆడబిల్ల పెండ్లి జేశేది." (వరికుప్పల లచ్చయ్య)

కొందరు "అందర్కి లేవు కొందర్కుండేది. <u>కొందర్కి</u> లేకపొయేద్." (కర్నాటి చంద్రయ్య)

3.3.2.1 సంభార వాచకాలు

వడ్లు "ఎండబెట్టి కారం కారం గొట్కునేది, మల్ల పొద్దునంతలొచ్చి <u>వడ్లు</u> దంచేది."(ఎస్కె అమీన)

"<u>మిర్పలు,</u> <u>కందులు</u>, <u>వుల్వలు</u> ఇయ్ బండేది." (కర్నాటి చంద్రయ్య)

"<u>సద్దలు</u>, <u>జొన్నలు</u>, <u>కొర్రలు</u> ఇయ్ బండేది." (కర్నాటి చంద్రయ్య)

3.3.3 నిత్య ఏకవచనాలు:

అక్కడ "ఇగ <u>అక్కడ</u> బూఁవి అక్కడ్నే. నేన్ పెల్లిగాకతోల్నె రెండెక్రాలు పట్టజేయించుకున్న మా మాఁవతోటి." (మావిడి ఈశ్వరయ్య)

ఇక్కడ "అదే వర్కని <u>ఇక్కడ</u> జూశ్న. ఇక్కడ ఒస్తుంది మల్ల."(కంది లింగయ్య)

3.3.3.1 లోహవాచకాలు

బంగారం "<u>బంగారం</u> వందకుంది నేన్జూడంగ." (కర్నాటి చంద్రయ్య)

3.4 మాన్యత (Honour):

3.4.1 -గారు

"ఓ ఎఱ్ఱ సంచేస్కున్న, ఎఱ్ఱబట్టల్గట్కున్న, మాల మీదనే బుడ్డచిర్తల్దెచ్చుకోని ఇగ బ్రమ్మం<u>గార్</u> పాటల్ బాడ్కుట బొయిన రైల్ల." (మావిడి ఈశ్వరయ్య)

3.4.2 -అమ్మ

"<u>ముసలమ్మ</u>కు నాకు ముసలమ్మక్కాల్లు లేవు. నాకు నడుఁవుల్లేవు. నడవరాదు కుసోరాదు." (మావిడి ఈశ్వరయ్య)

"ఆయన <u>గంగమ్మ</u> జాతర జేపిస్తడు బీమనపెల్ల."(మావిడి ఈశ్వరయ్య)

"<u>యిందిరమ్మ</u> నాకొక అఱ్ఱిచ్చింది. ఆ యిందిరమ్మ పతకం మీదనె రెండఱ్ఱలేస్కున్న అండ్లనే వుంటున్న." (మావిడి ఈశ్వరయ్య)

3.5 నామ విభక్తులు-రూప నిష్పత్తి (Case Declension):

నామ ప్రత్యయాలు, క్రియా ప్రత్యయాలు అని ప్రత్యయాలు రెండు రకాలు. ఈ విభాగంలో లింగ, వచన ప్రత్యయాల తర్వాత చేరే వాటిని ప్రత్యయాలుగా గ్రహించడం జరిగింది. ప్రథమా విభక్తి మినహా మిగిలిన ద్వితీయాది విభక్తులు ప్రత్యయాశ్రయాలు.

3.5.1 ఔపవిభక్తిక/అనౌపవిభక్తిక నామాలు:

నామాలను ఔపవిభక్తికాలు, అనౌపవిభక్తికాలు అని రెండు రకాలుగా విభజించవచ్చు. ఒక నామంపై ఔపవిభక్తిక, అనౌపవిభక్తిక ప్రత్యయాలు రెండూ వచ్చే అవకాశం ఉన్నప్పుడు**,** ఔపవిభక్తిక ప్రత్యయాలు మొదట నామానికి చేరిన తర్వాతే అనౌపవిభక్తిక ప్రత్యయాలు చేరుతాయి. ఫలితంగా **'**ఔపవిభక్తిక రూపాలు**'** ఏర్పడతాయి. కొన్ని

నామాలు ఔపవిభక్తిక ప్రత్యయాలను గ్రహించకుండా ద్వితీయాది విభక్తి ప్రత్యయాలను నేరుగా గ్రహిస్తాయి. ఇలా ఏర్పడేవాటిని 'అనౌప విభక్తిక నామాలు' అంటారు.

3.5.2 ఔప విభక్తిక రూపాలు (case declension):

3.5.2.1 -ంటి

లకారం మీద: ఇల్లు+ంటి = ఇంటి

"ఇంటికొచ్చేయాలకు పొయ్ పొయిల బూడ్దుంటేనే బువ్వొన్నట్టు. లేకపోతే లేదు." (కర్నాటి చంద్రయ్య)

"శాపలేంపితే! మీ యింటికాడేంపితే యి అంత ఆసన గొట్టేది." (కర్నాటి చంద్రయ్య)

నకారం మీద: కన్ను+ంటి =కంటి

"తేలకంటిగూడెం, తిమ్మనగుడెం ఇదివరకు ఒక్కటే అది."(కంది లింగయ్య)

కకారం మీద: వొక+ంటి =వొంటి< ఒంటి

"ఆ నైటూ తొమ్మిదిగంట్లక్ బెట్కుట్టే వొంటిగంటయ్యేది." (మావిడి ఈశ్వరయ్య)

3.5.2.2 -అటి

అప్పుడు "ఓ ఇగ అప్పటి బాదలన్ని జెప్తె శాన వున్నయయ్య." (మావిడి ఈశ్వరయ్య)

ఇప్పుడు "శాస్త్ర పద్దతైతె యెలమాలంటరాల్లని ఇప్పటిగ్గూడ." (మావిడి ఈశ్వరయ్య)

3.5.2.3 -టి

లోపట్నే "నాకోడల్ లోపట్నే వుంటది."(ఎస్కె అమీన)

నూరు "దాదాపు వంద నూటిర్వై మంది లేబరొస్తున్నరు."(కంది లింగయ్య)

మొదలు "కాని, మొదటిసంది కష్టపడ్డగాని సుకం లేదు." (మావిడి ఈశ్వరయ్య)

3.5.2.4 -ఇ

సర్వనామాల మీద:

పరప్రత్యయాలు (post positions) మీద:

మీద "ఆ మీద మోటరు బుయ్యునసురుక్తది." (కర్నాటి చంద్రయ్య)

కాడ=దగ్గర "పెద్దమనుషుల కాడిక్ బోతె ఇంతమందినెందుగ్గన్నవంటుర్రయ్య. (మావిడి ఈశ్వరయ్య)

అందరు "యీనేఁవొ అందర్కి దానఁవిచ్చిండు." (మావిడి ఈశ్వరయ్య)

3.5.2.5 -తి

రాతి "ఇగా యెన్కమర రాతిగోడ కట్టి లేపి ఆ రేకుల్...ఇగ ముందల సాయ్మాను సాయ్మాను కింద బర్లు మేకలు నేను అట్ల వుండే." (కర్నాటి చంద్రయ్య)

3.5.2.6 -అ

పిల్లలక్ "మా బుజ్జికన్న జరవస్తదేఁవ్ గాని పిల్లలక్ మొత్తఁవే రాదు."(ఎస్కె అమీన)

3.5.2.7 -ఆని

వారానికి "తొమ్మిదొందల రూపాలు వారానికి ఒక్ గడ్డపార గొనుక్కోవయ ఒక వారం పశలు బెట్టి అంటుర్రాల్లు."(కంది లింగయ్య)

3.5.2.8 -ని

నామాలపై చేరటం:

జనానికి "ఇందిరమ్మొచ్చినంకనే...పశ్మలు గూడ బంపింది మన జనానికి." (కర్నాటి చంద్రయ్య)

శివునికి "మూదువందలర్వైరోజులు శివునికి పూజ జెయ్యాల." (మావిడి ఈశ్వరయ్య)

ప్రథమ పురుష సర్వనామాలపై:

వాని **"**యీ రెండున్నోన్కి బువ్వ కరువు. వానికుండదు." (మావిడి ఈశ్వరయ్య)

ఆని "ఆ ఇగ బత్తడు. ఇగ సాద్ సాద్ సాదుకుంట ఆని పెండ్లాన్ని బాగ సాదుకుంటడు అనేది." (వరికుప్పల లచ్చయ్య)

3.5.3 ఔపవిభక్తిక అనౌప విభక్తిక రూపాల పర్యాయత:

కనగల్ మండల మౌఖిక వ్యవహారంలో మాపు, పొద్దు, వాడు వంటివి కొన్ని సందర్భాలలో ఔపవిభక్తిక రూపాలుగా, అనౌపవిభక్తిక రూపాలుగా కనిపిస్తున్నాయి.

ఔపవిభక్తిక రూపాలు:

"మాపు బువ్వబెట్టక్‌బోతే ఆలక్ ఈలక్ బాద." (కర్నాటి చంద్రయ్య)

"మరా నైటొచ్చి యీడ పొద్దున్నే లేచి ఆల్లు టైం జెప్తరు. ఎన్మిదిగంట్లకా తొమ్మిదిగంట్లకా అంటె, తొమ్మిదిగంట్ల వరకల్ల పూల్ల తిర్గుత, తానం జేస్త. ఇంత దింట పోత." (మావిడి ఈశ్వరయ్య)

"ఆడు బువ్వ బట్టక్ జీతం బొయిండు." (మావిడి ఈశ్వరయ్య)

అనౌపవిభక్తిక రూపాలు:

"మాపటీలేమో ఈలతో కమిట్టోల్లొచ్చి బువ్వ బెడ్తవా పెట్టవా అని కుండలకెగబడేది." (కర్నాటి చంద్రయ్య)

"పొద్దటీలి ఎన్మిదిగంట్లక్ వెట్కుంటె వొకట్రెండయ్యేది." (మావిడి ఈశ్వరయ్య)

"వాడు రూపాయిచ్చిండా నువ్ యాబై...రూపాల మీద్ కూసున్నవ్ ఆనిక్ పదిచ్చి నువ్ పద్దినాదని అడ్గిండు." (మావిడి ఈశ్వరయ్య)

3.5.4 ప్రథమా విభక్తి రూపాల నిర్మాణం:

ప్రథమా విభక్తిని సూచించే ప్రత్యయాలు తెలుగులో వేరుగా లేవు. ఇవి ప్రత్యయాశ్రితాలు కావు. లింగ, వచన బోధక నామాలే ప్రథమా విభక్తిని బోధిస్తాయి.

3.5.5 ద్వితీయాది విభక్తి ప్రత్యయాలు:

కనగల్ మండల మౌఖిక భాషలో(ఇప్పటివరకు సేకరించిన సమాచారం ఆధారంగా) ఉన్న ద్వితీయాది విభక్తి ప్రత్యయాలు ఉదాహరణ పూర్వకంగా ఈ కింద ఇవ్వబడ్డాయి.

3.5.5.1 ద్వితీయా విభక్తి ప్రత్యయాలు:

-ని "యీా యేశాల పుల్లయ్యొస్తె <u>మనని</u> దిననియ్యడు." (మావిడి ఈశ్వరయ్య)

"<u>మనూరమ్మాయిని</u> గూడిచ్చిరు ఆ వూల్లకి." (మావిడి ఈశ్వరయ్య)

-ను "మీ <u>పేద్‌తాతను</u> సాదుకున్నరు సాదుకున్నాయనేఁవొ పాలకూరి పుల్లయనేది." (మావిడి ఈశ్వరయ్య)

3.5.5.2 తృతీయా విభక్తి ప్రత్యయాలు:

సహార్థంలో (Associative):

-తోటి "ఒకా ముప్పై నల్వై మెట్లున్నయన్కొ, ఒక <u>పదిమందితోటి</u> పైకొచ్చేది." (తోలుగళ్ళ రాములు)

"<u>నాతోటి</u> జదివినోల్లంత పేపర్ జదితోల్లె ఎక్కువుంటరు." (వరికుప్పల లచ్చయ్య)

-తో "మాప్టీల్ <u>ఆలతో</u> పొద్దటీలేఁవొ యీాలతోని." (కర్నాటి చంద్రయ్య)

-తోన్/తోని

"<u>నీతోన్</u> తెలుగు మాట్లాడ్తం."(ఎస్‌కె అమీన)

"ఆల్లియ్యనే ఇయ్యనంటె, ఇగ అహో! శాన తిర్గి తిర్గి తిర్గి పన్నెండేండ్లు పంచాయితి బెట్కున్న <u>ఆలతోని</u>." (మావిడి ఈశ్వరయ్య)

కరణార్థంలో (Instrumental):

-తోటి "ఇగ బండలొస్తె బరాల బొరాలొ బెట్టి <u>గన్నులతోటి</u> పలగొట్టి ఎల్లదీశేది." (తోలుగళ్ళ రాములు)

"గానుగ<u>తోటి</u> తొక్కేది." (తోలుగళ్ళ రాములు)

3.5.5.3 చతుర్థీ విభక్తి ప్రత్యయాలు:

'కు' ప్రత్యయం చతుర్థీ విభక్త్యర్థంలో కనిపిస్తుంది.

"ఆ డెబ్బై రూపాల<u>కు</u> మూన్నె అర్నెల్లు జీతఁవున్న."(కర్నాటి చంద్రయ్య)

3.5.5.4 పంచమీ విభక్తి ప్రత్యయాలు:

-నుంచి "ఇగ ఆ <u>నుంచి</u> ఇగ పసులకాన్నేనాయ్." (కర్నాటి చంద్రయ్య)

"మీ తాత యేశాలేశి కోటుక్‌బోయ్ <u>కోటునుంచి</u> కొన్ని ఎకరాలిడ్పిచ్చిండు." (మావిడి ఈశ్వరయ్య)

/-పట్టి ~బట్టి ~వట్టి/ (వల్ల, వలన అనే అర్థంలో)

"ఇగ ఇది సదువుకో<u>బట్టి.</u> సదువుకున్నంక ఇయన్ని కులమతం ఎక్కడ్దని." (తోలుగళ్ళ రాములు)

/-కంటె/ "బడా అంటెనేఁవొ పెద్ద. <u>నాకంటె</u> పెద్దాయన."(ఎస్కె అమీన)

~కన్న "ఒక్క <u>పూజకన్న</u> రా అంటుర్రు గాని యేఁవొ అయ్యాల ఆరోగ్యం మంచిగుంటె పోత లేపోతె లేదు." (మావిడి ఈశ్వరయ్య)

"నాల్గు మూడు ఐదు <u>ఐదుకన్న</u> ఎక్కువ బోలె అంతవరకు జదివేది." (వరికుప్పల లచ్చయ్య)

3.5.5.5 షష్ఠీ విభక్తి ప్రత్యయాలు:

-కు "కోటప్పకొండ<u>కు</u> అయిద్సార్లు బొయిన." (మావిడి ఈశ్వరయ్య)

-కి "ఆ సాఁవిన్జాడన్గనే ఒక్కసాఁవి<u>క్కి</u> పాటొస్తలేదు." (మావిడి ఈశ్వరయ్య)

"ఆడిబిల్లని మాత్రం జాబున్నోని<u>కి</u> జూశియ్యలె." (వరికుప్పల లచ్చయ్య)

3.5.5.6 సప్తమీ విభక్తి ప్రత్యయాలు:

-లో/-లొ "ఇందీ<u>లొ</u> మా బాసల ఆ తాయిబా అంటెనేఁవొ పెదనాయిన."(ఎస్కె అమీన)

"ఆ ఆరు కమ్మ<u>లో</u> ఏడు కమ్మలో జద్విన." (కర్నాటి చంద్రయ్య)

-ల "నన్ను బెదిరిస్తున్న అంటున్నవెట్ల! బొక్కే నీకిస్తి, ఆదారకార్డిస్తి, బియ్యఁకార్డిస్తి, ఇంక పేరడుగుతున్నవేంది? <u>అండ్ల</u> లేదా పేరు?" (మావిడి ఈశ్వరయ్య)

-ల్ల "<u>ఇండ్లల్ల</u> బల్లెక్కడియప్పుడు మాకు బడ్లేదు." (వరికుప్పల లచ్చయ్య)

"లేపోతె బైట యే <u>టెంకలల్ల</u> బెట్నా ఆగదు."(కంది లింగయ్య)

-లోపట "పదిహేనుకు <u>లోపట</u> మగపిలగాడి పెండ్లి జేశేది." (వరికుప్పల లచ్చయ్య)

-న "లేకపొతె ఆ ఇక్కడ్ నెత్తి <u>నెత్తిన</u> బెట్కొని పొయ్యేది." (వరికుప్పల లచ్చయ్య)

3.5.5.7 సంబోధన ప్రథమా విభక్తి:

తాత "అంటే పొనుగోట్ల బాగోతులాడ్తుంటే పొయినం <u>తాత</u>!" (కర్నాటి చంద్రయ్య)

"ఆ కాలం రావాల్నంటె <u>తాత!</u> ఇగ రాదు." (కర్నాటి చంద్రయ్య)

సారు "ఎట్లుంటుంది ఇగ పావుల బొయిన పావుల మిగుల్తుంది <u>సారు</u>." (చెనగాని యాదమ్మ)

"నాకొక్కడెం గూడ జేశిర్ <u>సారు</u> ఐదు వే…ఆ ఐద్తులాలది." (మావిడి ఈశ్వరయ్య)

4. ముగింపు:

ఈ పత్రంలో ఉదహరించిన వ్యవహర్తల సంభాషణల్లో పదప్రయోగ విశేషాలతోపాటు, పదాల ఉచ్చారణలోని వైవిధ్యాన్ని, వాక్యనిర్మాణంలోని విశేషాలను కూడా గుర్తించవచ్చు. వ్యవహర్తలు వర్ణసమీకరణం చెందిన రూపాలను(బదులు+ఎక్కడియప్పుడు=బల్లెక్కడియప్పుడు) వాడడం కనిపిస్తుంది. 'ముందే' అనే అర్థంలో 'తోల్నే' అనే పదం ('పెల్లిగాకతోల్నె' అనే పదప్రయోగంలో), 'నుండి' అనే అర్థంలో 'సంది' అనే పదం ('మొదటిసంది' అనే పదప్రయోగంలో) కనిపిస్తున్నాయి. ఉర్దూభాషా ప్రభావం వల్ల ఈ ప్రాంతంలో హలంత రూపాలు ఎక్కువగా వినిపిస్తాయి. ముఖ్యంగా అనునాసిక్యతతో పలకవలసిన చోట అర్థానునాసిక్యతతో ఉచ్చరించిన పదాలు అధికంగా ఉన్నాయి. చెప్పాలనుకున్న విషయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలనే ఉద్దేశంతో మాటలను వేగంగా పలకడం వల్ల పదాలలో వర్ణలోపాలు జరిగాయి. మహాప్రాణాన్ని అల్పప్రాణం చేసి పలకడం. ఉదా: బర్త; బాస; బుజకీర్తులు; సుకం. అల్పప్రాణాన్ని మహాప్రాణం చేసి పలకడం. ఉదా: ఘుద...మొదలైనవాటిని గుర్తించవచ్చు. వ్యక్తుల మధ్య భాషలో ఉండే సూక్ష్మమైన భేదాల వెనుక సామాజిక, ఆర్థికపరమైన కారణాలు అనేకం ఉంటాయి. వాటిని అర్థంచేసుకొంటూ వ్యవహర్తల మాటలలోని పదప్రయోగాలను గమనిస్తే భాషావ్యాప్తిలో, భాషాభివృద్ధిలో వారు నిర్వహిస్తున్న పాత్ర అవగాహనకు వస్తుంది. ఆధునిక తెలుగుభాషా స్వరూపాన్ని అర్థం చేసుకోడానికి, తెలుగు భాషకు సమగ్ర వ్యాకరణం రూపొందించడానికి, సమగ్ర నిఘంటువును నిర్మించడానికి మౌఖికభాషపై జరిగే ఇలాంటి పరిశోధనలు సహకరిస్తాయి.

5. ఉపయుక్త గ్రంథసూచి:

1. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2000. భాష-సమాజం-సంస్కృతి. హైదరాబాదు: నీల్ కమల్ పబ్లికేషన్స్.
2. కృష్ణమూర్తి, భద్రిరాజు. 2018. ***తెలుగు భాషా చరిత్ర***. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం(10వ ముద్రణ).
3. దక్షిణామూర్తి, పోరంకి. 1992. భాష-ఆధునిక దృక్పథం. హైదరాబాదు: పి. వరలక్ష్మి పబ్లిషర్స్.
4. పాండయ్య, అప్పం. 2007. మహబూబ్‌నగర్ జిల్లా తెలుగు సామాజిక భాషాశాస్త్ర పరిశీలన. హైదరాబాదు: జయమిత్ర సాంస్కృతిక వేదిక.
5. రామారావు, చేకూరి. 2022. ***తెలుగు వాక్యం***. హైదరాబాద్: కావ్య ప్రచురణలు.
6. సుబ్రహ్మణ్యం, పి.ఎస్. 2019. ***ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు.*** హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

5.1 పిహెచ్.డి. సిద్ధాంత గ్రంథాలు:

7. చంద్రయ్య, ఎస్. 2017. ***తిమ్మాజిపేట మండల మౌఖిక భాష - వర్ణనాత్మక వ్యాకరణం.*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

8. పవన్ కుమార్, పమ్మి. 2003. కట్టా వరదరాజు ద్విపద రామాయణం: భాషాపరిశీలన. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

9. మల్లేశ్, మంత్రి. 2019. ***తెలంగాణ మాండలిక నవలలు***: ***భాషాపరిశీలన***. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం.

5.2 పరిశోధన పత్రాలు:

10.పవన్ కుమార్, పమ్మి. మార్చి, 2024. తెలుగు మౌఖికవ్యవహారభాష: పరిశోధనావశ్యకత. హైదరాబాద్: మూసీ మాసపత్రిక. సంపుటి-27: సంచిక-5.

11.పవన్ కుమార్, పమ్మి., నవీన్ కుమార్, బొమ్మగాని. ఫిబ్రవరి, 2025. సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం: ప్రయోజనాలు. హైదరాబాదు: నడుస్తున్న తెలంగాణ మాసపత్రిక. సంపుటి-15, సంచిక-2.

5.3 English:

12. Chambers, J. K. 2003. Sociolinguistic Theory. Oxford: Blackwell.
13. Hudson, R. A. 1996. Sociolinguistics. 2nd edn. Cambridge: Cambridge University Press.
14. Sapir, E. 1921. Language: An Introduction to the Study of Speech. New York: Harcourt, Brace.
15. Trudgill, P. 2000. Sociolinguistics: An Introduction to Language and Society. 4th edn. England: Penguin Books.

In fond memory of Prof. Madasamy Subbaiah Thirumalai –
***A Passionate Advocate for Education* (09-04-1940 - 18-06-2025)**
****